
ప్రజాశక్తి
శనివారం 27 జనవరి 2024 | 5 | అనంతపురం





జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు



శ్రీధర్



కళాశాల అధ్యాపకులు, కమిటీ వారితో శ్రీధర్ (ఫైల్ ఫోటో)

పురం వాసికి పద్మశ్రీ

పురస్కారాన్ని అందుకున్న శ్రీధర్

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణ వాసి శ్రీధర్‌కు దేశం గర్వించ దగ్గ పద్మశ్రీ అవార్డు దక్కింది. శ్రీధర్ హిందూపురం పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో 1973-76 సంవత్సరంలో బీకాం పూర్తి చేశారు. అనంతరం ఇదే కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహించారు. బెంగుళూరు యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి ప్రొఫెసర్, డీన్, డైరెక్టర్‌గానూ పనిచేశారు. బెంగుళూరులోని చాణక్య యూనివర్సిటీ ఛాన్సలర్‌గా పని చేశారు. 2009 నుంచి 2013 వరకు కర్నాటక నాలెడ్జ్ కమిషన్ మెంబర్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యులు, ఆల్ ఇండియా బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏఐసిటిఇ సభ్యులు, ప్రస్తుతం యుజిసి న్యూఢిల్లీ సభ్యులు, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌గా ఉన్నారు. విద్యారంగంలో శ్రీధర్ చేసిన సేవలను గుర్తించి కర్ణాటక ప్రభుత్వం కర్నాటక రాజ్యోత్సవ అవార్డు, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ నుంచి జనరల్ ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. ప్రస్తుతం ఆయనను భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. శ్రీధర్ మేనేజ్‌మెంట్‌లో స్ఫూర్తిదాయకమైన ప్రొఫెసర్, పరిశోధకుడు, ఇన్‌స్టిట్యూషన్ బిల్డర్, వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకులు. నలభై సంవత్సరాలకు పైగా బోధన, పరిశోధన అనుభవం ఉంది. హిందూపురం నుంచి గతంలో పద్మశ్రీ అవార్డు కల్లూరు సుబ్బారావుకు వచ్చింది. ఇప్పుడు ఎంకె.శ్రీధర్‌కు పద్మశ్రీ రావడంపై పురం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ విద్యాసాగర్ పద్మశ్రీ శ్రీధర్ కలిసి చదువుకున్నారు.

పలువురు కమిషనర్ల బదిలీ

ప్రజాశక్తి- అనంతపురం కార్పొరేషన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురు కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భాగ్యలక్ష్మి గ్రీన్ అండ్ బ్యూటిఫుల్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్‌గా ఫారిన్ సర్వీసెస్ కింద నియమించారు. అదనపు కమిషనర్ రమణారెడ్డిని పులివెందుల కమిషనర్‌గా బదిలీ చేశారు. డిప్యూటీ కమిషనర్ సావిత్రిని ఆమె మాత సంస్థ మెప్మా ఎమ్‌డి వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. ఆమె స్థానానికి ఎస్.గూడూరు కమిషనర్ ఎం.వెంకటేశ్వర్లు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. ధర్మవరం మున్సిపల్ కమిషనర్ శేషన్నను తెనాలి కమిషనర్‌గా బదిలీ చేశారు. గుంతకల్లు కమిషనర్ మల్లికార్జున ప్రొద్దుటూరు కమిషనర్‌గా నియమించారు. వెంకటరామయ్యను గుంతకల్లు కమిషనర్‌గా నియమించారు. రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డిని నగిరి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వి.వి.నర్సారెడ్డిని కళ్యాణదుర్గం కమిషనర్‌గా నియమించారు. హిందూపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ప్రమోద్‌కుమార్‌ను జమ్మలమడుగు కమిషనర్‌గా నియమించారు.

ప్రగతి బాటలో జిల్లా

- కలెక్టర్ ఎం.గౌతమి
- పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకావిష్కరణ
- ఆకట్టుకున్న శకటాలు
- ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రజలతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులందరూ సమిష్టగా పని చేయనున్నట్లు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 75వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ గౌతమి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. పరేడ్ వీక్షణ చేసి, సాయుధ దళాల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రగతి, అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలు, సాధించిన ప్రగతి గురించి వివరించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ కెఎన్ఎన్.అన్బురాజన్, కలెక్టర్ కేతన్‌గార్గ్ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, అన్ని శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వమిస్తున్న ప్రతి పైసా పారదర్శకంగా అట్టడుగునున్న నిరుపేదలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ జిల్లా యంత్రాంగానికి సహకరమందివ్వాలని కలెక్టర్ గౌతమి కోరారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రగతిని వివరిస్తూ ప్రజలకు సందేశం ఇచ్చారు. ప్రతినెలా 14 రకాల పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల నుంచి రూ.3 వేలకు పింఛన్ మొత్తాన్ని పెంచి 2,94,232 మంది లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 31,306 స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగు విడతల్లో 948 కోట్ల రూపాయలను జమ చేశామన్నారు. వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకం కింద 2023-24 సంవత్సరంలో మూడు దశల్లో 1,913 మంది లబ్ధిదారులకు రూ.14.73 కోట్లను అందిచామన్నారు. వైఎస్ఆర్ చేయూత ద్వారా మూడు విడతల్లో రూ.1,48,163 మందికి రూ.789 కోట్లు అందిచామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా వసతి దీవెన, విద్యా దీవెన కింద విద్యార్థులకు ఈ ఏడాది రూ.124.60 కోట్లు ఖర్చు చేశామన్నారు. వైఎస్ఆర్ కాపునేస్తం, ఈబిసి నేస్తం ద్వారా లబ్ధిదారులకు సాయం అందిచామన్నారు. జగనన్న చేదోడు పథకం కింద నాలుగు విడతల్లో 54,961 మంది లబ్ధిదారులకు రూ.54.96 కోట్ల సాయాన్న అందిచామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందిచామన్నారు. అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం 2,13,390 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో 13 వేల రూపాయల చొప్పున రూ.277.41 కోట్లను జమ చేశామన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామన్నారు. వ్యవసాయానికి సంబంధించి పెట్టుబడి రాయితీ కోసం 1.60 లక్షల మంది రైతులకు రూ.251.20 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ కింద ప్రతి రైతు కుటుంబానికి ఏటా 13,500 రూపాయల సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈ ఏడాది 2.94 లక్షల కుటుంబాలకు రూ.337.54 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ఉద్యానవన, పట్టు పంటల సాగు రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 2023-24వ సంవత్సరంలో జిల్లాకు 13.048 టిఎంసిల నీరు కాగా వీటితో 26 చెరువులను నింపామన్నారు. వైఎస్ఆర్ గహ నిర్మాణ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రూ.1,371 కోట్లతో 76,169 గహ నిర్మాణాలను చేపట్టామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ప్రభుత్వ లబ్ధిని ప్రజల చెంతకు నేరుగా అందించడానికి అందరూ సహకరించాలని కోరారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు



వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు, అధికారులు ప్రదర్శించిన శకటాలు చూపరులను ఆకట్టుకున్నాయి. డీఆర్డీఏ శకటం మొదటి స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో డీఈవో, మూడో స్థానంలో డిఎంహెచ్ఒ, నాలుగో స్థానంలో అగ్నిమాపక శాఖ శకటాలు నిలిచాయి. ఆయా శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ నుంచి అవార్డులను అందుకున్నారు. అనంతపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్, రక్షక ప్రీ ప్రైమరీ స్కూల్, గార్లదిన్నె కస్తూరిబా బాలిక విద్యాలయం, అనంతపురం విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, బుక్కరాయసముద్రం కస్తూరిబా బాలిక విద్యాలయం, యాటకల్లుకు జడ్పీ హైస్కూల్, కూడేరు కస్తూరిబా బాలిక విద్యాలయం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు 25 మంది జిల్లా అధికారులు, 340 మంది జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులకు ఉత్తమ అవార్డులను కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైభోమ్ నిదియా దేవి, జెడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగర పాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్‌లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్, ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మంజుల, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల తగాదాలు

- ఎన్నికల వేళా వీడని విభేదాలు
- 'బాబు' దారికితెచ్చేరా..!
- నేడు ఉరవకొండలో 'రా కదలిరా'
- హాజరుకానున్న టిడిపి అధినేత చంద్రబాబు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు ముంచుకొస్తున్నా తమ్ముళ్ల మధ్య తగవులు వీడటం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు, మూడు నియోజకవర్గాలు మినహా అన్ని చోట్ల గ్రూపు తగాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇవి 2019 ఎన్నికలకు ముందు కూడా ఉండేవి. వీటి నడుమే ఓటమిని చవి చూసింది. 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 నియోజకవర్గాల్లో టిడిపి ఓటమి చెందింది. రెండు పార్లమెంటు స్థానాలనూ కోల్పోయింది. ఇంతటి గడ్డు పరిస్థితులను టిడిపి ఎన్నడూ ఎదుర్కొనలేదు. ఈ ఫలితాల తరువాత అయినా నేతల్లో మార్పు వచ్చి ఏకతాటిపైకొస్తారనుకుంటే అదీ లేదు. ఇప్పటికీ అవే విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. సమన్వయం చేసేందుకు పలుమార్లు అధిష్టానం తీసుకున్న చర్యలు కూడా ఫలించలేదు. ఒకవైపు అధికార వైసిపి ఇప్పటికే ఎన్నికలకు సమయత్తమయ్యే పనిలోనుంది. ఎక్కడైనా నేతల మధ్య విభేదాలున్నా వాటిని సమన్వయపరిచే బాధ్యతలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేస్తున్నారు. ఇప్పటికే సగం నియోజకవర్గాలకు అభ్యర్థులను వైసిపి ప్రకటించి ఎన్నికలకు అన్ని విధాలుగా సమయత్తమవుతోంది. తెలుగుదేశం పార్టలో ఇప్పటికీ నియోజకవర్గాలపై స్పష్టత లేదు. టికెట్టు కోసం నాయకులు మాత్రం పెద్ద ఎత్తునే పోటీపడుతున్నారు. గ్రూపులు నడుస్తూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా చూస్తే కళ్యాణదుర్గంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరిల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులున్నాయి. 2019 ఎన్నికల ముందు నుంచి ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. శింగనమల నియోజకవర్గం ఎస్సీ రిజర్వులోనూ టుమెన్ కమిటీకి, బండారు శ్రావణికి మధ్య తగాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాయదుర్గంలో అనంతపురం టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డిల మధ్య పొసగడం లేదు. మడకశిర ఎస్సీ రిజర్వులోనూ మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిల మధ్య విభేదాలు తారా స్థాయిలోనే నడుస్తున్నాయి. ఒకరినొకరు సహరించుకునే పరిస్థితి లేదు. కదరిలో కందికుంట వెంకట ప్రసాద్, చాంద్‌బాషాల మధ్య ఇప్పటికీ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. పెనుకొండలో సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారధి, సబితాల మధ్య పోరు నడుస్తోంది. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎవరికి టిక్కెట్టు ఖరారు చేసినా మరొకరు సహకరించే పరిస్థితి లేదు. వీటి నడుమ త్వరలో వచ్చే ఎన్నికలకు ఏ రకంగా సమయత్తమవుతుందన్న సందేహాలున్నాయి. టిడిపి బలమైన క్యాడర్ ఉన్నా నేతల మధ్య విభేదాలతో వారు కూడా ఏ రకంగా పనిచేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లోనున్నారు. నేడు చంద్రబాబు 'రా కదలిరా' కార్యక్రమంలో ఉరవకొండలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. రాత్రికి కూడా ఇక్కడే బస చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నేతలతో మాట్లాడే అవకాశమున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నారు. ఆ సమయంలో నియోజకవర్గాల నేతలతోనూ మాట్లాడి కొంతవరకు దిశానిర్దేశం చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

నేడు చంద్రబాబు పర్యటన

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నేడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం సాయంత్రం ఉరవకొండలో జరిగే 'రా కదలిరా' కార్యర్రకమంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3.40 గంటలకు ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో ఉరవకొండకు ఆయన చేరుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం రాత్రికి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు అంటే ఆదివారం ఉదయం 9.45 గంటలకు ఇక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో నెల్లూరు జిల్లాకు వెళ్తారు.

ఉరవకొండలో ఏర్పాట్లు పరిశీలన

ఉరవకొండ : చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ టిడిపి నాయకులతో కలిసి శుక్రవారం నాడు పరిశీలించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులుతో పాటు స్థానిక టిడిపి,జనసేన నాయకులతో కలిసి సభా ప్రాంగణంతోపాటు హెలీప్యాడ్ వద్ద పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న రా కదిలా రా కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోందన్నారు. ఉరవకొండలో జరిగే ఈకార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి తెలుగుదేశం,జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఉరవకొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు

హక్కులను కాపాడుకుందాం

'రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ'లో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను కాపాడుకుందాని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వంలో ముసాయిదా కమిటీ 60 రాజ్యాంగాలను తులనాత్మక అధ్యయనం చేసి భారత రాజ్యాంగాన్ని రూపొందించిందని తెలిపారు. 'రాజ్యాంగ పీఠిక'లో రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలను వివరించారన్నారు. 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ 'మౌలిక స్వరూపాన్ని' పేర్కొందన్నారు. దాదాపు 105కుపైగా రాజ్యాంగ సవరణలు జరిగినప్పటికీ రాజ్యాంగ మౌలిక స్వరూపం కొనసాగుతూనే ఉందన్నారు. అయితే 2014 నుంచి ఇప్పటి వరకూ భారత రాజ్యాంగం 'మౌలిక స్వరూపమే' కోల్పోయే విధంగా దాడులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్ల నుంచి బయట పడాలంటే ప్రజాచైతన్యం, ప్రజాభిప్రాయమే ప్రధాన మార్గం అన్నారు. ఈసమయంలో ప్రజాతంత్ర వాదులందరూ ఐక్యమై రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు కుళ్లాయప్ప, సంజీవరెడ్డి, సిఐటియు నాయకులు నాగేంద్ర, నెట్టికంటయ్య, వ్య.కా.సం నాయకులు పుల్లయ్య, ఎర్రన్న, చేతివృత్తిదారుల సంఘం నాయకులు అంకాలు, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు చిన్న ఆంజనేయులు, వెంకటాపురం చంద్ర, ఓబులేసు, మల్లేష్, కాశప్ప పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం 'రాజ్యాంగం పీఠిక ప్రతిజ్ఞ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సమానత్వ పరిపాలన, అందరికీ విద్య, ఉపాధి, మహిళా రక్షణ, సాంఘిక ఆర్థిక, రాజకీయ న్యాయం, సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 75 సంవత్సరాల క్రితం భారతదేశం రాజ్యాంగాన్ని రాసుకున్నామన్నారు. అయితే ప్రస్తుతం కొన్ని మతోన్మాద శక్తులు దేశంలో రాజ్యాంగానికి తూట్లు పొడిచేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా రాజ్యాంగంలో ఉన్న హక్కులు పూర్తిగా అమలు కాకుండా బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ సమయంలో యువత, విద్యార్థులు ఐక్యమత్యమై మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర బాలికల కో కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షులు గిరి, నగర అధ్యక్షుడు భీమేష్, నాయకులు సోము, వీరా, ఐద్వా నాయకురాలు రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



అనంతపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

శాస్త్ర సాంకేతిక రంగంలో భారత్ స్వయం ప్రతిపత్తి

జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం స్వయం ప్రతిపత్తి సాధించిందని జెఎన్‌టియు ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెఎన్‌టియు క్రీడా మైదానంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఎన్‌సిసి, ఎంబిఎ, సివిల్, ఇసిఇ, కెమికల్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర్య దినోత్సవం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ మధ్యకాలంలో అనేక రంగాల్లో దేశం ఎనలేని అభివృద్ధి సాధించిందన్నారు. ముఖ్యంగా దేశాభివృద్ధిలో విద్యార్థులు కీలకపాత్ర పోషించి సామాన్యులకు సైతం నూతన ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సిబ్బంది కలిసి మెలిసి పని చేసి విశ్వవిద్యాలయాన్ని దేశంలోనే మేటి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని కోరారు. ఇకపోతే హానర్స్ డిగ్రీ, మైనర్స్ డిగ్రీ, స్కిల్ ఓరిఎంటేడ్ కోర్సులు, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు ఇంటెన్‌షిప్‌లు వంటి నూతన సిలబస్‌లను రూపొందించినట్లు వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యర్రమాలు ఆహూతులను అలరించాయి. అలాగ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్వీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో గణతంత్ర్య దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, కళాశాల విభాగాధిపతులు, పిఆర్ఒ ఎం.రామశేఖర్‌రెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఓటిపిఆర్ ఐ సిబ్బంది, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న జెఎన్‌టియు విసి శ్రీనివాసరావు

తిరుపతి-కదిరిదేవరపల్లి పాక్షిక రైలు రద్దు గడువు పొడిగింపు

రాయదుర్గం : తిరుపతి-కదిరి దేవరపల్లి మధ్య నడిచే ట్రైన్ నెంబర్ 07589/07590 కదిరిదేవరపల్లి-గుంతకల్లు మధ్య పాక్షిక రద్దు గడువును మరో నెల రోజులు పొడిగించినట్లు నైరుతి రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్ ఆదేశాల మేరకు సమాచార అధికారి బిఎల్ శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తులు పూర్తికానందున ఫిబ్రవరి నెలాఖరు వరకూ ఈ పాక్షిక రద్దు కొనసాగుతుందని, ప్రయాణికులు గమనించాలని సూచించారు.


అనంతపురంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్


జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న మేయర్ వసీం


వైసిపి కార్యాలయంలో అంబేద్కర్, గాంధీజీకి నివాళులర్పిస్తున్న నాయకులు


జెండా వందనం చేస్తున్న మాజీ సైనికులు

రెపరెపలాడిన మువ్వన్నెల పతాకం

జిల్లావ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అనంతపురం రేంజ్ కార్యాలయంలో డిఐజి అమ్మిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిఐజి మాట్లాడుతూ 1950 జనవరి 26న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి రాజ్యాంగం అందించిన సందర్భంగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని దేశానికి అందించడం సంతోషకరమన్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటివి మన రాజ్యాంగ మూల స్తంభాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, డిఐజి కార్యాలయం మేనేజర్ మాధవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో కూడా ఎస్పీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, సభ్యులు గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, స్పెషల్ బ్రాంచి సి.ఐ జాకీర్ హుస్సేన్, ఎస్‌ఐ వెంకటకృష్ణ, ఎస్పీ సీసీ ఆంజనేయప్రసాద్, క్యాంపు కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ ఆవరణలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ మహమ్మద్ వసీం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఇందులో భాగంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మేఘ స్వరూప్, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ అధ్యక్షురాలు ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిణి ఎ.సుబ్బరత్నమ్మ, శివశంకర్‌ప్రసాద్, ఇంతియాజ్ అహ్మద్, రామాంజనమ్మ, మల్లికార్జున, బాషా, కావేరి, నాగమణి, హేమమాలిని, శిరీషా, ఉజ్జినేశ్వరి, సరస్వతి, బాలచంద్ర, ఇందిర, , పాఠకులు పాల్గొన్నారు.

అనంతపురం : వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ మానేకింది లిఖిత, మాజీ ఛైర్మన్ బోయ వీరాంజనేయులు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, కార్పొరేషన్ ఛైర్మన్లు ఎస్.రంగన్న, నదీమ్‌అహ్మద్, మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గౌస్ బేగ్, సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, కెప్టెన్ షెక్షావలి, జోనల్ ఇన్‌ఛార్జి రిలాక్స్ నాగరాజు, నాయకులు సైఫుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్‌పీరా, బిందె శ్రీదేవి, రాధాయాదవ్, జెసిఎస్ కన్వీనర్ చింతకుంట మధుసూదన్, కె.ధనంజయయాదవ్, వెంకటరామిరెడ్డి, అనిల్‌గౌడ్, రాష్ట్ర డైరెక్టర్లు కెవి రమణ, యల్లనూరు ప్రసాద్, భూమిరెడ్డి జాహ్నవి, మహిళా నాయకురాళ్లు లక్ష్మీదేవి, శోభారాణి, శోభాబాయి, అంజలి పాల్గొన్నారు.

అలాగే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కళాశాల, ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ బి.రవీంద్రనాథరెడ్డి ఆచార్యులు రామస్వామి, విద్యార్థి వ్యవహారాల అధికారి కొండారెడ్డి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని మాంటిసోరి పాఠశాలలో కరస్పాండెంట్ ఎస్.సూర్య నారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలోని గుఫుర్ కాలనీలో ఉన్న డాక్టర్ కెఎస్‌ఎన్ గఫూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీదేవి, కళాశాల ఛైర్మన్ అబ్దుల్ రజాక్ గఫూర్, ప్రిన్సిపల్ ఆర్డ్ ఆయుబ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆర్గనైజింగ్ డాక్టర్ పరదేశినాయుడు, ఆదిరెడ్డి, ఫ్యాకల్టీ భరత్, కళాశాల మేనేజర్ జిలానీబాషా, తదితరులు పాల్గొన్నారు.

కూడేరు మండలంలోని గొటుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సైనికభవనంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ షేక్షన్న ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు వి.కె రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, మహేశకుమార్, నాగభూషణం, నీలిరత్నం, క్రిష్ణ, నాగరాజు, నాగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, అంకే ఈశ్వరయ్య, సదానందం, కుమ్మర నాగేంద్ర, రాపా ధనుంజయ్, కిరణ్ కుమార్, జయమ్మ, అవుకు విజయ కుమార్, ముప్పూరి కృష్ణ, మేదర

వెంకటేష్, దరాజ్ బాషా, లాల్‌స్వామి, రాజేష్ ఖన్నా, అంజి, సంపత్, వల్లంశెట్టి వెంకటరమణ, ఆకుల అశోక్, సంతోష్ కుమార్, కాయగూరల లక్ష్మీ ప్రసాద్, అరుణ, అంజలి, వర్షిత, నాయకులు ఎస్.నజీర్, డాలర్ మధు, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇటుకలపల్లిలో ఉన్న అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఛైర్మన్ అనంత రాముడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి పాటలు, నాటికలు, నాట్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈవో నరసింహారావు, ప్రిన్సిపల్ నళిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న నారాయణ స్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం రమేష్‌బాబు, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రాధానాయుడు, వైస్ ప్రిన్సిపల్ గౌసియా, సుధా, వాణి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని కోర్టు రోడ్డు, రుద్రంపేట బైపాస్‌లోని ఎటిపి-1, హౌసింగ్ బోర్డులోని ఏటీపీ-8 శ్రీ చైతన్య పాఠశాలల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఎటిపి-8లో జరిగిన కార్యక్రమంలో ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ నేత్రావతి, డీన్.అరుణ్‌కిరణ్, సి.బ్యాచ్ ఇన్‌ఛార్జి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. మిగతా బ్రాంచిల్లో ప్రిన్సిపాల్ తబుస్సుం, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏవో గోపాల్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ప్రైమరీ ఇన్‌ఛార్జిలు నీరజ, భారతి, తేజస్విని, సరిత, భవరీస్, అమరావతి, ఏవో విజయ్‌కృష్ణన్, పిఇటి శివప్రసాద్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మూడవ రోడ్డులోని సాయి విజ్ఞాన్ పాఠశాలలో పాఠశాల డైరెక్టర్లు ఎంపీ శ్రీనివాసులు, కరుణాకర్ బాబు, ప్రిన్సిపల్ లావణ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

పెద్దపప్పూరు : మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో కార్యాలయంలో ఎంపిపి రామిరెడ్డి, ఎస్‌ఐ శరత్ చంద్ర, కాసుల లక్ష్మీకాంత్‌నాయక్, ఇఒ ఆంజనేయులు, తదితరులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే మౌర్య హైస్కూల్ లో కరస్పాండెంట్ లక్కినేని ఆంజనేయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విప్ కాపు రామచంద్రారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి విద్యావతి జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయ గీతాలపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు రవిచంద్ర, ఆజాద్, జూనియర్ అసిస్టెంట్ రాజసింహ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో డిటి మల్లేష్‌ప్రసాద్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుబ్రమణ్యం జాతీయ పతాకాలను ఎగురవేశారు. కాగా మండలంలోని సూరేపల్లి గ్రామంలో మూడు ప్రభుత్వ పాఠశాలల్లో 105 మంది విద్యార్థులకు సూరేపల్లి సర్పంచి యు.రాజేశ్వరి వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, సర్పంచి రామిగాళ్ల ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ దివాకర్, విద్యాధికారి కార్యాలయంలో ఎంఇఒ కృష్ణయ్య, పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అశ్వర్థనాయుడు జాతీయ పతాకాలను ఎగురవేశారు. అలాగే మండల కేంద్రంలోని మిత్ర, ఎల్‌ఎస్‌ఆర్‌డబ్ల్యు, సరస్వతి విద్యా మందిరం పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, సర్పంచి సుప్రియ ఉప సర్పంచి శ్రీరాములు, ఇఒఆర్‌డి శైలజారాణి, సీనియర్ అసిస్టెంట్ నూరు మొహమ్మద్, జూనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, ఎపిఒ రమేష్ రామారావు, టైపిస్ట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఇకపోతే జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎంపిడిఒ దివాకర్, నార్పల ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంఇఒ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ రాజావిష్ణువర్ధన్‌రెడ్డి అవార్డు అందుకున్నారు.

బెళుగుప్ప : జిల్లాకేంద్రంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎస్‌ఐ శివ ఉత్తమ అవార్డును అందుకున్నారు.

ఉరవకొండ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎం.నరసింహులు, పంచాయతీ కార్యాలయంలో సర్పంచి లలిత జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంల్లో డిప్యూటీ తహశీల్దార్ నరేష్, సర్వేయర్ శుభకర్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, ఎంపిడిఒ అమృతరాజ్, పంచాయతీ కార్యదర్శి గౌస్


శ్రీచైతన్య ఎటిపి-8లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి, సిబ్బంది

సాహెబ్, వైసిపి పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు రామాంజినేయులు, సర్పంచి ఇందిరమ్మ, ఎంపిటిసిలు మునెయ్య, ముద్దయ్య, పాపన్న, వైసిపి నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, రామచంద్ర, లాలెప్ప, గురు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలవ్యాప్తంగా గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సునీతాబాయి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కాగా అనంతపురంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పామిడి సచివాలయం-2లో పని చేస్తున్న విఆర్‌ఒ ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్.ఐ.క్రాంతికుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్‌ఎం రామ్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు పాఠశాల ఉపాధ్యాయురాలు క్రీస్తువాణి రూ.10వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో దేవాదాయ ధర్మాదాయ శాఖ పామిడి మండల ఎగ్జిక్యూటివ్ అధికారి కృష్ణయ్య ఉత్తమ అధికారిగా పురస్కారం అందుకున్నారు.
స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇమ్రాన్‌ఖాన్, ఉమెన్ కానిస్టేబుల్ సుప్రజ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

గార్లదిన్నె : జిల్లాకేంద్రంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తహశీల్దార్ ఉషారాణి, వ్యవసాయ శాఖ అధికారి పి.సోమశేఖర్ ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

గుత్తి : మండలవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా న్యాయస్థానాల ప్రాంగణంలో న్యాయమూర్తులు, మున్సిపల్ కార్యాలయం వద్ద ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ జి.శ్రీనివాసులు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి జి.విశాలాక్షి, ఎంపిడిఒ చిట్రా శ్రీనివాసులు, తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎడిఎ ఎం.వెంకటరాముడు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ రాజ్‌కుమార్, సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, రైల్వేస్టేషన్లో స్టేషన్ మాస్టర్ ఎ.సురేష్‌బాబు, గాంధీ కూడలిలో వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, పెన్షనర్స్ భవన్‌లో అధ్యక్షులు కె.అబూబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, శ్రీకష్ణదేవరాయలు విగ్రహం వద్ద బలిజ సంఘం అధ్యక్షుడు బండి సత్య వారి వారి కార్యాలయాల వద్ద మువ్వన్నెల జాతీయ పతాకాలను ఎగురవేశారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని సచివాలయం వద్ద సర్పంచి పార్వతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇందులో భాగంగా గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దవడుగూరు : మండలవ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగభూషణ, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కుళ్లాయిస్వామి, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ నారాయణనాయక్, ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ రాముడుతోపాటు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. కాగా జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల్లో యాడికి సిఐ శంకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ సురేష్‌రెడ్డి, ఎస్సీ బాలికల సంక్షేమ శాఖ వార్డెన్ ఉమాదేవి, ఏఎస్‌ఐ మధుసూదవ్, ఉపాధి హామీ ఎపిఒ పుల్లారెడ్డి, చిట్టూరు విఆర్‌ఒ నిరంజన్‌రెడ్డి, తదితరులు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.

శింగనమల : మండల వ్యాప్తంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గుమ్మేపల్లిలో సర్పంచి డేగల లలితమ్మ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి నాగరాజు, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, రవినాయక్, నాగేశ్వరావు, నాయకులు డేగల శ్రీనివాసులు, కొయ్యగూర పెద్దన్న, లక్షుమయ్య, మల్లికార్జున, డేగల మల్లికార్జున, గొంగటి ఓబుళపతి, బండి ఎర్రిస్వామి, డేగల కిరణ్, కమ్మర బ్రాహ్మయ్య, శ్రీనివాసులు, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : ఎస్‌ఐ ఆంజనేయులు రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈయన రెండు నెలల క్రితం బదిలీపై రాప్తాడు మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. ఎస్‌ఐకి అవార్డు దక్కడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రాయదుర్గం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తన నివాసం వద్ద మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు.


కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలను అందుకుంటున్న నార్పల ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, పామిడి మహిళా కానిస్టేబుల్



పెద్దపప్పూరు మౌర్య పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు

చంద్రబాబుతోనే రైతు, కూలీల అభివృద్ధి

గార్లదిన్నె : చంద్రబాబు అధికారంలోకి వస్తానే రైతులు, రైతు కూలీల అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా పంట పొలాల్లో తిరుగుతూ రైతులు, కూలీలతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు, రైతు కూలీలకు ఒరిగిందేమీ లేదన్నారు. ముఖ్యంగా మద్యపానం నిషేధిస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ మద్యం రేట్లు పెంచి రైతు కూలీలను రోడ్డున పడేశాడని ఆరోపించారు. అనంతరం టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సామల మధు, రమణప్ప, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న జి.శంకర్‌రెడ్డి తాగునీటి కొళాయిని ఏర్పాటు చేయించారు. మైదానంలో ఆటలు ఆడే క్రీడాకారులు టోర్నమెంటులు జరిగేటప్పుడు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సమస్యను గమనించిన ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి సుమారు రూ.8వేల ఖర్చుతో ఏర్పాటు చేయించిన మంచినీటి కొళాయిని విశ్రాంత తెలుగు టీచర్ వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటప్రసాద్ ప్రారంభించారు. క్రీడాకారుల సౌకర్యార్థం కొళాయి ఏర్పాటు చేయించిన ఉపాధ్యాయుడికి గ్రామస్తులతోపాటు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

బెలుగుప్ప : రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షులు బి.శివలింగప్ప కోరారు. ఈమేరకు మండల కేంద్రంలో కందుల కొనుగోలుకు దరఖాస్తు చేసుకున్న రైతుల కందులను శుక్రవారం కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రెండు రోజులు నుంచి ఈ క్రాప్ బుకింగ్ చేసి రిజిస్టర్ చేయించుకున్న రైతుల నుంకి కందులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు క్వింటా కందులను రూ.9,370కు కొనుగోలు చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన వారంలోపు రైతుల ఖాతాలకు నగదు జమ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ పాండు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే క్రీడా మైదానంలో శుక్రవారం జిపిఎల్ సీజన్-3 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, ఆర్‌డిటి కోఆర్డినేటర్ యుగంధర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఇందులో భాగంగా గుత్తి గ్రీన్స్, గ్లాడియేటర్స్, గుత్తి స్యాచేర్స్, లెవెన్ బడ్డీస్ అనే నాలుగు జట్లు మూడు రోజులపాటు జరిగే పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిట్‌నెస్ ట్రైనర్ బొమ్మన్న, కోచ్‌లు నరేష్, జోషి, రఘు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి రవి, కోశాధికారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉపకులపతి జివిఆర్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ముందుగా విసి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల పాటు వైద్య శిబిరాన్ని నిర్వహించున్నట్లు తెలిపారు. ఈ శిబిరం ఏర్పాటు విద్యార్థులు, యూనివర్శిటీ సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్వీ.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, దుర్గాప్రసాద్, పి.సుజాత, సి.శోభాబిందు, మాధవి, ఎం.రామశేఖరరెడ్డి, శారద, కల్యాణిరాధా, అజిత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

శింగనమల : టిడిపి అధినేత చంద్రబాబు ఉరవకొండ పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ చంద్రబాబు ఉరవకొండలో నిర్వహించే 'రా కదిలి రా' బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వ వైఫల్యాలను వివరించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, బండి పరుశురాం, బెస్త నారాయణస్వామి, తలారి తిప్పన్న, కాయల సురేష్‌యాదవ్, ప్రసాద్‌నాయక్, సతీష్‌రాయల్, దండు ప్రకాష్, డీలర్ శీనాయక్, నరసింహనాయక్, పుల్లయ్య, కాయల శివశంకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఛేంజ్ ఫర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థకు భారత సేవా రత్న పురస్కారం

రాయదుర్గం : రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్న 'ఛేంజ్ ఫర్ సొసైటీ' స్వచ్ఛంద సంస్థకు భారత సేవా పురస్కారం దక్కింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన, వైద్య శిబిరాల నిర్వహణ, నిరాశ్రయులకు అన్నదానం, క్షయ వ్యాధిగ్రస్తుల దత్తత, దివ్యాంగులకు సైకిళ్లు, నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, తదితర 26 రకాలకు పైగా సేవలు అందించారు. వీటిని గుర్తించి భారత సేవా రత్న పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు విజయ వాడలోని తాసుబెల్లి ఫౌండేషన్ నిర్వాహకులు శంకర్‌నాయుడు వెంకట్‌లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు.

బిఎన్ హళ్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా విభాగం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో రెండో రోజైన శుక్రవారం మండల పరిధిలోని బిఎన్ హళ్లి గ్రామంలో వాలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. వాలంటీర్లు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, చెత్త చెదారం తొలగించారు. అలాగే పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అధ్యాపకులు ప్రసాద్, మల్లికార్జున, పాలరాజ్, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ ట్యాంకర్ ప్రారంభం

రాయదుర్గం : స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ ట్యాంకర్‌ను శుక్రవారం ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ప్రారంభం చారు. మున్సిపల్ కార్యాలయం వచ్చే ప్రజల సౌకర్యార్థం ట్యాంకర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ మెప్మా ఇన్‌ఛార్జి టిఎంసి నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వలిబాషా, గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, చెన్న వీరస్వామి, మంజునాథ, షబ్బీర్, పద్మజ, శ్రీలక్ష్మీ, లావణ్య, శారద, సంజీవ, అజయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, వైసిపి నాయకులు శివప్ప, శివ, నిజాముద్దీన్, ఇస్మాయిల్, శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గానికి రూ.210కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ సోదరుడు వై.శ్రీనాథ్‌రెడ్డి, మండల, పట్టణ కమిటీల సమన్వయకర్త ఓబన్న, పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, ఎంపీపీ నరసింహులు మాట్లాడుతూ సిఎం జగన్ ఉరవకొండ పర్యటన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరిన వెంటనే నియోజకవర్గంలో వివిధ పనులు చేపట్టేందుకు సిఎం జగన్ రూ.210 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ, ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు కొడికి గోవిందు, వెంకటేష్, పెన్నఅహోబిలం మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, ఉప సర్పంచి వన్నప్ప, పిఎసిఎస్ ఛైర్మన్ షేక్షావలి, వార్డు సభ్యులు పద్మావతి, ఓబులమ్మ, వాసు, మండల కో ఆప్షన్ సభ్యుడు సలీమ్, జెసిఎస్ కన్వీనర్ ఆసీఫ్, నాయకులు పామిడి నూర్, జయరాం, ఆటో సీనా, వడ్డే ఆంజనేయులు, జోగి అంజి, ఓబులేసు, రైతులు పాల్గొన్నారు.

శాంతి సమాజాన్ని నిర్మించుకుందాం

శోభాయమానంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ రథయాత్ర

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆశయాలు అసమానతలు, వివక్ష లేకుండా శాంతి సమాజం నిర్మాణమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా నడుద్దామని రాజాస్థాన్ కోమల్‌గడ్ రమేష్ గూరుజీ, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. త్వరలో జరగనున్న మహారాజ్ 285వ జయంత్యోత్సవాలను పురష్కరించుకుని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి సద్భావన రథయాత్ర నిర్వహించారు. నగరంలోని 1వ రోడ్డు బంజార్ భవన్ నుంచి ప్రారంభమైన యాత్ర టవర్‌క్లాక్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, విద్యుత్‌నగర్ సర్కిల్ మీదుగా ఆదర్శనగర్‌లోని మారెమ్మ తల్లి ఆలయం, నాయక్ నగర్‌లోని మరియామా యాడి ఆలయం వరకూ సాగింది. ఈ సందర్భంగా బంజారాలు ఎంతో భక్తి శ్రద్ధలతో సేవాలాల్ మహారాజ్‌ను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సేవాఘడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి, టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, ఉపాధ్యక్షులు కేశవనాయక్, సేవాఫడ్ ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్‌లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఎబిఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీనాయక్, బాబునాయక్, సేవాఘడ్ ట్రస్ట్ కోశాధికారి బాలానాయక్, సభ్యులు రంగ్లా నాయక్, ఎస్‌కె.రామచంద్ర నాయక్, బంజారా భవన్ స్థల దాత హరీష్‌శౌరి, డాక్టర్ శ్రీనివాస్ శౌరి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణానాయక్, ప్రధాన కార్యదర్శి చక్రే నాయక్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలాజీ నాయక్, బాబు నాయక్, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్ నాయక్, సుగుణాబాయి, శివమణి బాయి, క్రిష్ణా నాయక్, ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు, తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి బంజారాలు పాల్గొన్నారు.



శాంతి సద్భావన రథయాత్రలో పాల్గొన్న నాయకులు

ఎరుకుల జాతి ఉనికిని కాపాడుకుందాం


మాట్లాడుతున్న ఎరుకుల సమితి నాయకులు

పామిడి : ఎరుకుల జాతి ఉనికిని కాపాడుకుందాని ఎరుకుల ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే గోవిందు పిలుపునిచ్చారు. రూ.50 లక్షలు డిపాజిట్ చేస్తే శ్రీశైలం దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం 50 సెంట్లు భూమిని కేటాయించడంతోపాటు రూ.50లక్షలు కేటాయించి సత్రం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిందన్నారు. ఈనేపథ్యంలో సత్రం నిర్మాణానికి విరాళాల సేకరణపై శుక్రవారం అనంతపురంలోని మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్నతో సమావేశమై చర్చించారు. ఇందులో భాగంగా గంపన్న సుమారు రూ.లక్ష, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ రామకృష్ణ రూ.50వేలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్తు ఎరుకుల జాతి మనగడతోపాటు ఏకలవ్య వారసులకు గొప్ప వరంగా భావిస్తూ శ్రీశైలంలో సత్రం ఏర్పాటు చాలా ముఖ్యమన్నారు. ఇందుకు ప్రభుత్వంతోపాటు విశ్రాంత సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రోషన్న, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ జలంధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల ప్రజా పోరాట సమితి రాష్ట్ర గౌరవ సలహాదారులు పోలవీరా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే చిరంజీవి, సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ సభ్యులు కావేటి ఉమామహేశ్వరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ముత్యాలమ్మ, సాకే రవి, ఎరుకుల సాకే గంగాధర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రాజూనాయక్ తదితరులు పాల్గొన్నారు.